**Telugu**

# The Spoken Word

by

WILLIAM MARRION BRANHAM

# కాలముల యొక్క సంగ్రహాము

**(A Resume of the Ages)**

పలుకబడిన మాటయే మూలవిత్తనం

# కాలముల యొక్క సంగ్రహాము

## (A Resume of the Ages)

ఏడు సంఘ కాలములకు చెందిన లేఖన భాగములను ఒక్కొక్క వచనము ననుసరించి మనము అధ్యయనము చేశాము. వాటిని సవివరముగా చూచాము. సంఘము యొక్క ఒక నిరంతర చారిత్రిక మాదిరిని మనము రూపొందించ లేదు. ఆలాగు మనము చేసి యుండవలసినది. కాబట్టి ఈ అధ్యాయమును తీసికొనుటలో మన ఉద్ధేశ్యము ఒకటున్నది. ఎఫెసు కాలము మొదలుకొని అన్ని యుగముల లోను గల సంఘ చరిత్రను దేవుని ఆత్మ ద్వారా యోహాను కియ్యబడిన ప్రకారము పరీక్షించితిమి. ఇంతకు ముందే మనము నేర్చుకొనిన సంగతులకు సంబంధించి క్రొత్త సంగతులను అదనంగా చేర్చుట లేదు.

మన అధ్యయనములను బట్టి ఇంతకు ముందే దీనిని మనము నేర్చుకొని యున్నాము. ప్రత్యక్షతలో ఎక్కువ భాగమును పూర్తిగా అపార్థము చేసికొనుట జరిగినది. ఎందుకనగా సంఘమును గూర్చి ఇందులో చెప్పుట జరిగినదని గాని, సంఘమునకు ఇది చెప్పినట్లుగ గాని, ఈ గ్రంథములో ఇంతకు ముందు మనకు తెలియదు. పవిత్ర "ఎక్లీషియా" "ఏర్పరచబడినది" "క్రీస్తు యొక్క శరీరము" "పెండ్లి కుమార్తె" అని చెప్పబడలేదు. కాని ఇది క్రైస్తవులు అని పిలువబడిన పూర్తి శరీరముతో మాట్లాడు చున్నది. వారు నిజమైన వారయినా కావచ్చు లేక నామకర్థులయినా కావచ్చును. ఇశ్రాయేలీయులందరూ ఎలాగయితే ఇశ్రాయేలీయులు కారో, ఆలాగే క్రైస్తవు లందరూ క్రైస్తవులు కారు. ఆ విధంగా సంఘము రెండు ద్రాక్షావల్లులతో తయారైనదని మనము నేర్చుకొనుచున్నాను. నిజమగు ద్రాక్షావల్లి మరియు కారు ద్రాక్షావల్లి. ఈ

రెండు ద్రాక్షావల్లులు రెండు ఉద్దేశ్యములతో యున్నవి. రెండు ఆత్మల వలన పని చేయుచున్నవి. ఒకటి పరిశుద్ధాత్మ. మరియొకటి క్రీస్తు విరోధి ఆత్మతో నింపబడి యున్నది. రెండునూ దేవుని ఎరుగుదుమనియు, తమను దేవుడు ఎరుగుననియు చెప్పుకొనుచున్నవి. రెండునూ దేవుని పక్షముగా మాట్లాడుకొనుచున్నట్లుగా చెప్పుకొను చున్నవి. రెండును కొన్ని మూల సూత్రములను నమ్ముచున్నవి. మరి కొన్నింటి విషయములలో వేరుపడుచున్నవి. కాని ఇద్దరును ప్రభువు యొక్క నామమును భరించు చున్నం.ున, క్రైస్తవులుగా పిలువబడు చున్నందున, ఆ నామమును ధరించుకొనుట ద్వారా ఆయనతో సంబంధము ఏర్పరచుకొంటిమని చెప్పుకొనినందున, (దానిని దేవుడు పెండ్లి అనుచున్నాడు) దేవుడు ఆ ఇద్దరినీ ఇపుడు బాధ్యులనుగా చేసి ఇద్దరితో మాట్లాడుచున్నాడు.

కాలములు ముగియు వరకు ఈ రెండు ద్రాక్షవల్లలు ప్రక్క ప్రక్కనే ఎదుగునని మనము నేర్చుకొని యున్నాము. రెండునూ పరిపక్వమునకు వచ్చి కోయ బడును. కారు ద్రాక్షావల్లి జయించ నేరదు. నిజమగు ద్రాక్షవల్లిని నాశనము చేయ జాలదు. ఆ విధముగానే నిజమగు ద్రాక్షవల్లి కారు ద్రాక్షావల్లిని యేసు క్రీస్తుతో రక్షణ సంబంధమును కలిగి యుండునట్లుగా తీసికొని రాలేదు.

అతి ఆశ్చర్యకరమగు సత్యమును మనము నేర్చుకొని యున్నాము. మారు మనస్సు లేని కారు ద్రాక్షవల్లి క్రైస్తవుల మీద పరిశుద్ధాత్మ దిగి, శక్తిగల ప్రత్యక్షతలను ఆ యా సూచక క్రియలను, అద్భుతములను జరిగించి, యూదా దయ్యమై యున్నాడని చెప్పబడినప్పటికిని పరిశుద్ధాత్మ యందు ఖచ్చితమైన పరిచర్య కలిగి యుండినట్లే వీరును కలిగి యుందురు.

ఈ సూత్రములను మనము మనస్సులో యుంచుకొనవలెను. ఏడు కాలములలో సంఘము యొక్క దశలను మనము గమనించితిమి.

సంఘము పెంతెకోస్తు యొద్ద జన్మించెను. మొదటి ఆదామునకు దేవుడు తన చేతి నుండి నూతన పెండ్లి కుమార్తెను ఇచ్చెను. కొంత కాలము పాటు ఆమె **అపవిత్రపరచబడలేదు. ఆ విధముగానే కడపటి ఆదామగు క్రీస్తునకును పెంతెకోస్తు**

నందు ఒక పవిత్రమగు నూతన పెండ్లి కుమార్తె ఇవ్వబడెను. ఆమె కొంత కాలము ప్రత్యేకముగాను, పవిత్రముగాను నిలచి యుండినది. ''కడమ వారిలో ఎవడును వారితో తనకు తానుగా చేరలేదు.'' (అపో. కా. 5:13) ''మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అను దినము వారితో చేర్చుచుండెను.'' అపో. కా 2:47. ఇదెంత కాలము కొనసాగినదో మనకు తెలియదు. కాని ఒక దినమున హవ్వ సాతాను ద్వారా శోధించబడి మోసపుచ్చబడిన ప్రకారముగానే సంఘము కూడా క్రీస్తు విరోధి యొక్క ఆత్మ వలన చెడిపోయినది. ''క్రీస్తు విరోధి ఆత్మ వచ్చునని మీరు వినిన సంగతి ఇదే. యిదివరకే అది లోకములో యున్నది.'' I యోహాను 4:3. యేసు తన పెండ్లి కుమార్తెను గూర్చి మొదటి కాలములో చెప్పెను. ''అయినను మొదట నీకుండిన ప్రేమను నీవు వదిలితివని నేను నీ మీద తప్పు ఒకటి మోపవలసి యున్నది. నీవు ఏ స్థితిలో నుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారుమనస్సు పొందుము.'' ప్రకటన 2:4-5. మొదటి కాలములోనే సంఘము ఒక పడిపోయిన స్త్రీగా యున్నది. ఆదాము కంటె ముందుగా సాతాను హవ్వను పొందినది. అదే విధముగా క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తెయై యున్న సంఘమును, గొర్రెపిల్ల పెండ్లి మహోత్సవ విందునకు ముందే సాతాను మోసము చేసినది. ఆమె పడిపోవుటకు ప్రత్యేకముగా ఏమి కారణము? ప్రకటన 2:6. ''నీకొలాయితుల యొక్క క్రియలు.'' దేవుని యొక్క పవిత్ర వాక్యమును వెంబడించుటకు ఆ మొదటి సంఘము మానివేసినది. దేవుడు కోరిన విధంగా వారు లేరు. సంఘము ఆయన మీదనే ఆధారపడ వలెనని ఆయన కోరెను. (పూర్తి దేవుని మీదనే ఆధారపడి ఆయన వాక్యమును నెరవేర్చ వలెను. ఆది నుండి అంతము వరకును అలాగే యుండ వలెను. మానవ ప్రభుత్వమునకు వేరై యుండ వలెను) కాని నీకొలాయితుల క్రియలపై ఆధారపడినది. అది ఒక మానవ ప్రభుత్వ సంస్థయై సంఘములోనే యున్నది. అన్ని ప్రభుత్వముల వలెనె ప్రజల కొరకు శాసనములను రూపొందించెను. వారు ఇశ్రాయేలీయులు చేసినట్లుగానే చేసిరి. వారు వాక్యమును ఆత్మను విసర్జించి అందుకు బదులుగా మానవ ప్రభుత్వములను ఏర్పరచుకొనిరి.

మరణము ప్రవేశించినది మనకెట్లు తెలియును? మొదటి కాలములోని ఆత్మ యొక్క స్వరమును మనము వినలేదా? వినగల వారందరిని ఆయన పిలుచు చుండగా వారు వినిరి. "జయించు వానిని దేవుని పరదైసులో ఉన్న జీవ వృక్ష ఫలములు భుజింప నిత్తును." అప్పటికే సంఘము మరణ వృక్షములో చాలా లోతుగా పాతుకొని పోయినది. (అదే శాఖా సంబంధమగు కారు ద్రాక్షావల్లి) వారి అంతము అగ్ని గుండము. కాని ఇపుడు జీవ వృక్షమును కాపు కాయుటకు అగ్ని జ్వాలల ఖడ్గములతో కెరూబులు ఎవరూ లేరు. దేవుడు ఏదెను తోటలో నుండి వెళ్ళిపోయి నట్లుగా ఇపుడు సంఘము మధ్యలో నుండి వెళ్ళిపోజాలడు. చివరి కాలము వరకు ఆయన తన సంఘము మధ్యలోనే యుండును. ఆ కాలము వరకు ఆయన అందరినీ రమ్మని పిలచుచునే యుండును.

దయచేసి ఇక్కడ జాగ్రత్తగా యుండ వలెనని కోరుచున్నాను. ఎఫెసులో యుండిన సంఘపు దూతకు ఈ వర్తమానము ఇచ్చినట్లు చూచాము. కాని ఇది కేవలము ఎఫెసులో యున్న సంఘమునకు మాత్రమే వర్తించదు. ఇది కాలమునకు వర్తమానము. ఆ కాలములో సత్య బీజము ఉన్నది. అయితే తప్పు బీజము కూడా అక్షరాలా మనము గురుగులు గోధుమలు గూర్చిన ఉపమానములో చూచినట్లు గానే ప్రవేశించి యున్నది. సంఘ కాలములే పొలము. దానిలో గురుగులు, గోధుమలు ఉన్నవి. అబద్ధ సంఘము సంస్థగా మారినది. వాక్యమును మానవ ప్రభుత్వముగా ఏర్పరచి, నిజ క్రైస్తవులతో పోరాడిరి.

గోధుమల కంటెను మరియు ఏ ఇతర మొక్కల కంటెను గురుగులు ఎల్లపుడూ బలముగానే పెరుగుచుండును. గురుగుల సంఘము చాలా వేగముగా పెరుగుచుండును. మొదటి కాలములో అదే జరిగినది. కాని గోధుమల సంఘము కూడా వర్థిల్లు చున్నది. మొదటి కాలాంతమునకు నీకొలాయితుల క్రియలు స్థానిక అబద్ధ సంఘములలో వర్థిల్లు చుండెను. దానిని ఇంకా విస్తరింప చేయవలెనని అనేక ప్రయత్నములు చేయుచుండిరి. దాని ప్రభావము నిజ సంఘము మీదను వున్నది. మహా విశ్వాస వీరులగు పాలికార్పు వంటి వారు కూడా తమ్మును తాము

బిషప్పులుగా పిలచుకొనిరి. ఆ బిరుదును వాక్యములో ఎక్కడను మనము కనుగొన లేము. అనగా వారి అర్థము బైబిలులో లేదు. అంతే గాక ఆ కాలములో నిజ సంఘము తన మొదటి ప్రేమను పోగొట్టుకొనినది. పెండ్లి సమయములో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె కలిగి యుండు ప్రేమకు అది సాదృశ్యముగా యున్నది. వివాహమయిన తొలి దినములలో ఉండు ప్రేమకు పోల్చబడినది. ఆ సంపూర్తి ప్రేమ చల్లారి పోయినది. దేవుని వారు విడిచి పెట్టిరి.

కాని చూడుడి. ప్రకటన 2:1. ప్రభువైన యేసు తన సంఘము మధ్యను నిలబడి యున్నాడు. తన కుడి చేతిలో వర్తమానికులను పట్టుకొని యున్నాడు. పెండ్లి కుమార్తె పడిపోయినది గనుక, సంఘము మంచి చెడుల మిశ్రమ ద్రాక్షావల్లిగా పెరిగి యున్నది గనుక ఆయన విడిచిపెట్టి పోలేదు. అది ఆయన స్వంతము. రోమా 14:7-9 ప్రకారము అది అక్షరాలా నిజము. "మనలో ఎవడును తన కోసమే బ్రదుకడు. ఎవడును తన కోసమే చనిపోడు. మనము బ్రదికినను ప్రభువు కోసమే బ్రదుకుచున్నాము. చనిపోయినను ప్రభువు కోసమే చనిపోవు చున్నాము. కాబట్టి మనము బ్రదికినను, చనిపోయినను ప్రభువు వారమై యున్నాము. తాను మృతులకును, సజీవులకును ప్రభువై యుండుటకు ఇందు నిమిత్తమే గదా క్రీస్తు చనిపోయి మరల బ్రదికెను." సిలువ మీద ఆయన యావత్తు ప్రపంచములోని మనుష్యులందరిని కొని యున్నాడు. వారు ఆయన వారు. ఆయన మృతులకును, సజీవులకును ప్రభువే. (బంధుత్వము కాదు గాని స్వంతమై యున్నది) తనలో తాను జీవమును మరియు మరణమును కలిగి యుండిన ఆ శరీరము మధ్య ఆయన సంచరించు చున్నాడు.

మొదటి కాలములో నాటబడినది రెండవ కాలములోను, ఆ తరువాత కాలములన్నిటిలోను అనగా పరిపక్వము చెంది కోతకు వచ్చు వరకును ఎదుగుచునే యుండెను. ఆ విధముగా స్ముర్న కాలములో సంఘము యొక్క పరిపాలనా చరిత్ర గూర్చి ఎక్కువగాను, తేటగాను మనము తెలిసికొనగలము. ఆత్మ దానిని ప్రత్యక్షపరచు చున్నది.

ఈ కాలములో కారు ద్రాక్షావల్లి యొక్క ద్వేషము విస్తరించును. చూడండి. వారు నిజ సహవాసుల నుండి తమ్మును తాము వేరు చేసికొనిరి. (9 వచనము) వారి యొద్ద నుండి తొలగిపోయిరి. వారు అబద్ధికులు. వారు తమ యొద్ద లేని దానిని ఉన్నట్లుగా చెప్పుకొనిరి. కాని దేవుడు వారిని నాశనము చేయునా? చేయడు. "వారిద్దరిని కలిసి ఎదుగనియ్యుడి."

కాని వారిని ప్రభువే నాశనము చేయవలెను. ఎందుకనగా వారు ప్రభువు యొక్క ప్రజలను నాశనము చేసి వారిని చంపుచున్నారు.

కాని వారిని ఎదుగనియ్యమని ఆయన చెప్పుచున్నాడు. మరణము వరకు నీవు నమ్మకముగా యుండి ఇంకా ఎక్కువ నన్ను ప్రేమించుమని ఆయన తన పెండ్లి కుమార్తెతో చెప్పుచున్నాడు.

ఈ కారు ద్రాక్షావల్లి సాతాను యొక్క ద్రాక్షావల్లియేయని మనము ఖచ్చితముగా నేర్చుకొని యున్నాము. వారి సమాజము అదియే. (సాతాను) వారు దేవుని యొక్క నామములో కూడుకొనుచు తాము క్రీస్తు సంబంధులమని అబద్ధము చెప్పుకొనుచు, వారు బోధించెదరు. ఉపదేశించుదురు. బాప్తిస్మ మిచ్చుదురు. ఆరాధించుదురు. సంఘమునకు క్రీస్తు ఇచ్చిన ఆయా విధులను చక్కగా నిర్వహించెదరు. అయినా గాని వారు దేవుని సంబంధులు కారు. కాని తాము దేవుని సంబంధులమని చెప్పుకొను చున్నారు. కాబట్టి ఆయన వారిని బాధ్యులనుగా చేసెను. ప్రతి కాలములోను ఆయన వారితో మాట్లాడుచూ వారిని గూర్చి చెప్పుచుండెను. వారు నిజంగా బిలామును మనకు గుర్తుచేయు చున్నారు. అతనికి ప్రవక్త సేవ యున్నది. దేవుని ఎట్లు సమీపించ వలెనో ఖచ్చితముగా అతనికి తెలియును. పవిత్రమగు జంతువులను బలిగా అర్పించెను. అయినను అతడు నిజమగు వాక్య ప్రవక్త కాడు. బాలాకును ఘనపరచుటకు వెళ్ళ వద్దని దేవుడు అతనితో చెప్పెను. అయిననూ వెళ్ళవలెనని అతడు ప్రయత్నించెను. బంగారము మరియు గౌరవము తనకు కావలెనని అతడు ఆశించి వెళ్లెను. కావున దేవుడు అతనిని పోనిచ్చెను. దేవుని పరిపూర్ణ చిత్తము దేవుని అనుమతిపూర్వక చిత్తమునకు మార్గము నిచ్చెను. ఎందుకనగా బిలాము యొక్క హృదయ కోరికను

ఆయన చూచెను. వెళ్ళుమని దేవుడు అతనితో చెప్పెను. దేవుడు తన మనస్సును మార్చుకొనెనా? మార్చుకోలేదు. బిలాము వెళ్ళుచున్నా గాని దేవునికి తన స్వంత విధానము ఉన్నది. బిలాము దేవుని చిత్తమునకు లోబడలేదు. దేవునికి స్వంత విధానము ఒకటున్నది. నష్టపోవు వాడు బిలాము. ఎందుకనగా అతడు వాక్యమును దాటిపోయెను. ఈ రోజున అదే మన మధ్య జరుగు చున్నది. స్త్రీ ప్రసంగీకులు, సంస్థలు, అబద్ధ బోధలు మొదలగు వాటిచే ప్రజలు దేవుని ఆరాధించుచు ఆత్మ ప్రత్యక్షత నందించు చున్నారు. బిలాము వెళ్ళినట్లుగానే వారు వెళ్ళుచు దేవుడు తమతో మాట్లాడెనని చెప్పుకొనుచున్నారు. కాని వారు చేయుచున్న కార్యము బయలుపడిన వాక్యమునకు విరుద్ధమైనది. వారితో దేవుడు మాట్లాడలేదని నేను చెప్పను. కాని దేవుడు బిలాముతో రెండవసారి మాట్లాడినట్లుగానే యున్నది. బిలాము యొక్క హృదయములోని కోరిక వేరు. వాక్యములో కాదు గాని తన స్వంత హృదయ వాంఛను అతడు తీర్చుకొనగోరెనని దేవుడెరుగును. అతడు చివరికి తన స్వంత మార్గమునే అనుసరించెను. ఈ రోజున కూడా దేవుడు జనులను తమ హృదయ కోరిక ననుసరించియే వెళ్ళుమని ముందుకు పంపు చున్నాడు. ఎందుకనగా వారు వాక్యమును ఎప్పుడో విసర్జించి యున్నారు. ఏమైనను దేవుని యొక్క చిత్తమే జరుగును. ఆమేన్. దీనిని మీరు చూచారని తలంచు చున్నాను. కాలము లన్నిటి లోను చూచిన దానిని నేను విశదపరచుట మాత్రమే కాక, ముఖ్యముగా ఈ చివరి కాలము వారికి సహాయము చేయవలెనని కోరుచున్నాను. ఈ కాలమునకు ఎన్నో ప్రత్యక్షతలు, వెలుపటి ఆశీర్వాదములున్నవి. ఈ పూర్తి కాలమంతయూ అలాగే యున్నది. వాక్యము బయలుపరచిన చిత్తమును వారు వ్యతిరేకించు చున్నారు.

ఈ కాలము వలె అధిక శబ్దముతో తేటగా వర్తమానమును వచ్చిన కాలము మరియొకటి లేదు. పాత నిబంధన సత్యమును మనమెరుగుదుము. దాసురాలి యొక్క కుమారుడు స్వతంత్రురాలి యొక్క కుమారుని బాధపరచును. దాసురాలి యొక్క కుమారుడు వెళ్ళగొట్టుబడు వరకు ఆలాగున జరుగును. నిజ క్రైస్తవులకు విరోధముగా సాతాను ద్వేషమును వెళ్ళగ్రక్కుచూ దేవదూషణ చేయుచున్నాడు. నామకార్థ గుంపు వారు, అబద్ధ క్రైస్తవులు దీనిని చేయుచున్నారు. లవొదికయ

కాలాంతములో అబద్ధ ద్రాక్షావల్లిని దేవుడు వ్రేళ్ళతో కూడా పెళ్లగించు వరకూ ఇది విస్తారమగుచునే యుండును.

ప్రవచనపు ఆత్మ ద్వారా మూడవ కాలము నందు లోకపు సంఘము నీకొలాయితుల బోధను ఒక సిద్ధాంతముగా అనుసరించునని బయలుపరచబడెను. మత గురువులను కాపరులను వేరు చేయుట క్రమముగా పెరిగినది. బైబిలు సత్యమును అనుసరించి పెద్దలు (అనగా స్థానిక సంఘముల యొక్క కాపరులు) వాక్యము ద్వారా మందను ఏలుటకు బదులుగా నికోలాయితుల క్రియలు వారిని పరిపాలించు చున్నవి. యాజకులు గౌరవ స్థానములను అలంకరించుచు ఒకరుపై మరొకరు అధికారులుగా యున్నారు. అది వాక్యానుసారమైనది కాదు. చివరికది యాజకత్వముగా మారిపోయినది. మానవులకును, దేవునికిని మధ్యగా యాజకులు నిలబడుటను గూర్చి చెప్పిరి. యాజకులకు కొన్ని ప్రత్యేక హక్కులు ఇచ్చుచు దేవుడిచ్చిన హక్కులను వీరు నిరాకరించు చుండిరి. ఇదే అతిక్రమము. ఈ కాలములో అది ఒక బోధనగా మారి దేవుని యొక్క వాక్యమంత నిశ్చయమగా చెప్పబడినది. కాని అది నిశ్చయముగా వాక్యానుసారమైనది కాదు. కాని మత గురువులు దానిని దేవుని వాక్యమని పిలచిరి. కావున అది అంత్య క్రీస్తు సిద్ధాంతమైనది.

మానవ ప్రభుత్వము పూర్తిగా రాజకీయముగా వున్నందున సంఘము రాజకీయములలో కలసి పోయినది. ఈ కలయికను ఒక నియంతయగు చక్రవర్తి ఆహ్వానించి, సంఘ రాజకీయములను రాజ్య రాజకీయములతో ఏకము చేసెను. బలము చేత అబద్ధ సంఘమును స్థాపించెను. (సాతాను యొక్క అబద్ధ మతము) దానిని నిజమగు మతమనెను. ఆ యా నీతి శాస్త్రముల ద్వారా అనేకులు చక్రవర్తులు అబద్ధ సంఘమును రాజ్య రాజకీయములతో ఏకము చేసిరి. నిజమగు ద్రాక్షావల్లిని మరి బాహాటముగా నాశనము చేసిరి.

నిజమగు ద్రాక్షవల్లి ఈ సిద్ధాంతమును పూర్తిగా నిరోధించ లేకపోయినదని చెప్పుటకు చింతించు చున్నాను. దాని వలన ఆ నిజ ద్రాక్షవల్లి నికొలాయితుల తలంపులను ఒక సిద్ధాంతముగా స్థాపించినదని నా భావన కాదు. దానికది ఎంతో దూరముగా

వున్నది. కాని ఆ స్వల్పమైన మరణపు పురుగు ఆ నిజ ద్రాక్షవల్లిని అతికి అది ఏ విధముగా నైనను పడునని తలంచు చున్నది. నిజ సంఘములో కాపరులుగా యున్నవారు స్థానికుల కంటె అధికులమని వ్యక్తపరచు చిన్న చిన్న బిరుదులను ఉంచుకొనిరి. ఆ విధముగా స్థానికుల కంటె మేము ఎక్కువ వారమని చెప్పుకొన సాగిరి. ఈ కాలములో సంఘములోని వారు పౌలు యొక్క బోధలను అర్థము చేసికొనలేదు. వారు నాలోని ప్రభువును మహిమపరచిరి అని పౌలు చెప్పెను. పౌలునకు యెటువంటి అధికారమున్నైను, సమస్త అధికారము గల దేవుని జనులు చూచునట్లుగా అతడు చేసెను. కాని మత గురువులు ఎల్లపుడును మానవునితో కలిసియున్న దైవిక నాయకత్వమును చూచిరి. ఆ విధముగా వారు ఘనపరచకూడని వారిని ఘనపరచ సాగిరి. నిజ సంఘము కూడా మానవతా వాదముతో కళంకమును పొంది, నీకొలాయితుల బోధను స్థాపించిరి. అపొస్తలుల వారసత్వమును స్థాపించిరి. సేవకులను నియమించిరి. సంఘ కాపరులు దానికి వోట్లు వేసిరి. అబద్ధ సంఘమునకు ఒక్క అడుగు దూరములోనే వారుండిరి. బిలాము యొక్క మార్గమును వారు అనుసరించగోరుచున్నారు. సాతాను యొక్క లోతుల లోనికి వెళ్ళుటకు వారు రెండవ అడుగు వేయుదురు. అదిపుడు పూర్తి అభివృద్ధిలో యున్నది.

బిలాము యొక్క సిద్ధాంతమే ఈ రెండవ అడుగు. (ప్రకటన 2:14 లో వివరింపబడెను.) ఒక ఐక్య కూటము ద్వారా ఇశ్రాయేలీయులు త్రోవ తప్పునట్లుగా బిలాము బాలాకునకు నేర్పెను. ఆ అతిథులు దేవుని యొక్క వాక్యమునకు విరోధముగా మరి రెండు సంగతులు జరిగించుదురు. మీకది గుర్తుండి యుండును. తన రాజ్యమునకు సహాయము చేయుటకు బాలాకునకు ఒకటి అవసరమయ్యెను. ఆ దినములలో గొప్ప అధికారము గల ఆత్మీయ నాయకునిగా పేరొందిన బిలామును అతడు పిలచెను. ఇశ్రాయేలీయులను వల వేసి నాశనము చేయు సలహాను అతడు ఇచ్చెను. అన్నిటికన్న ముందు ఇచ్చిన సలహా చూడండి. అందరూ ఒక చోట కలిసికొని సంగీతులు చర్చించుకొని కలిసి భోజనము చేసి విషయములను సరిదిద్దుకోవలెనని సూచించెను. ఒకరినొకరు అర్థము చేసికొన వలెనన్నచో చాలా సమయము కావలెను. ఒకసారి దానిని నీవు స్థాపించుకొనిన యెడల అక్కడ నుండి

నీవు ఎంత దూరమైనా పోగలవు. ఆ తరువాత మెట్టు, కలిసి ఆరాధన చేయుట. అవతలి వారు బలవంతము చేయుట వలన అతిథులు అనుకొన్న దానికంటె కొద్దిగా ఎక్కువగానే ముందుకు వెళ్ళక తప్పదు. పాత నిబంధనలోని దేవుని సంఘమునకు మాత్రమే ఇది జరుగ లేదు గాని క్రొత్త నిబంధన సంఘమునకు కూడా ఇది జరిగినది. బాలాకు వంటి ఒక చక్రవర్తి యున్నాడు. అతడు తన రాజ్యము విషయములో సహాయము చేయుమని కోరెను. కావున కాన్‌స్టాంటయిన్ నామకార్థ క్రైస్తవులను ఆహ్వానించెను. రోమ్ యొక్క మొదటి క్రైస్తవ సంఘము. అతనికి సహాయము చేయుటకు క్రైస్తవులు వచ్చిరి. ఎందుకనగా క్రైస్తవులు ఎక్కువ సంఖ్యలో యుండిరి. దాని యొక్క ఫలితమే 325 లోని నైసియను ఆలోచన సభ. అక్కడ నిజ క్రైస్తవులు, నామకార్థ క్రైస్తవులు ఇరువురును ఏకముగా కూడి వచ్చిరి. కాన్‌స్టాంటయిన్ వారిని ఆహ్వానించెను. నిజ క్రైస్తవులకు ఆ కూటమునకు వెళ్ళవలసిన అవసరము ఏమీ లేదు. కాన్‌స్టాంటయిన్ వారినందరినీ ఏకము చేయగోరెను. కాని చోటికి తాము వెళ్ళుచున్నామని నిజ విశ్వాసులకు తెలియును. అయినా వెళ్ళిరి. నిలచియున్న వారికి రాజ్య ఖజానాను, రాజకీయ శారీరక అధికారమును కాన్‌స్టాంటయిన్ ఇచ్చెను. జనులకు విగ్రహారాధన, భూత ఆరాధన పరిచయము చేయబడెను. పరిశుద్ధుల పేర్లు గల ఫలకములు భవనములలో ప్రవేశ పెట్టబడినవి. మృతులతో మాట్లాడుటను జనులకు నేర్పించిరి. పరిశుద్ధులకు ప్రార్థనలు చేయుటను నేర్పిరి. ఇది భూతారాధన తప్ప మరేమీ కాదు. మానవులకు నిజంగా కావలసినది దేవుని వాక్యాహారము. కాని వీరికి ఆచారములు, సిద్ధాంతములు, సంప్రదాయ పూజలు ఇవ్వబడినవి. రాష్ట్రముచే బలవంతము చేయబడిరి. అన్నిటి కంటె పైగా వారికి ముగ్గురు దేవుళ్ళు ఇవ్వబడి, ఒకే నిజ దేవునికి మూడు బహుళ నామములను పెట్టిరి. ప్రభువైన యేసు క్రీస్తు నామములో నీటి బాప్తిస్మమును ఇచ్చుటకు బదులుగా మూడు బిరుదులలో అన్య బాప్తిస్మమును ఇయ్యసాగిరి.

నిజ విశ్వాసులు అక్కడికి వెళ్ళి యుండవలసినది కాదు. అప్పటికే వారు ఎంతో సత్యమును పోగొట్టుకొనిరి. ఇపుడు వారు దేవత్వము గూర్చి తమకు గల అవగాహనను పోగొట్టుకొనుచు. నీటి బాప్తిస్మమును బిరుదుల నామములను ఉంచిరి.

ఈ బిలాము యొక్క బోధను జాగ్రత్తగా గమనించండి. చెడిపోయిన మత గురువులు జనుల కళ్ళకు గ్రుడ్డితనమును కలుగజేయసాగిరి. ఇందుకు వారు బహిరంగముగానే ప్రయత్నములు చేయుట మనము అన్నిటి కంటె పైగా గమనించ వలెను. ప్రజలను బాహాటముగా అవిశ్వాసమను పాపము లోనికి నడిపించ సాగిరి. నీకొలాయితుల బోధ మత గురువులను చెరచినది. వారిలో వారు రాజకీయాధికారము కొరకు పోరాడుకొనసాగిరి. బిలాము తన బోధ ద్వారా జనులను వారి యొక్క ఆచారముల వైపునకును, విగ్రహారాధన వైపునకును మళ్ళించెను. ఆ విధంగా వారిని వశపరచుకొనెను. దీనినిపుడు జాగ్రత్తగా గమనించుడి. ప్రజలను నామకార్థ సంఘములో బంధించినది, దాని తరువాత వారిని నాశనము చేయునది ఏమిటి? ఆచారములు మరియు సంఘములో రూపొందించబడిన సిద్ధాంతములు. అది రోమను కాతలిక్కు సంఘము యొక్క సిద్ధాంతము. వాక్యమను నిజ ఆహారము వారికి అనుగ్రహించబడలేదు. విగ్రహారాధన నుండి, బబులోనీయ అన్యత్వమును క్రైస్తవ పదములతో చేర్చబడిన ఆరాధన నుండి వచ్చిన ఆహారమును వారికి అందించిరి. అదే ఆత్మ మరియు సిద్ధాంతము ప్రొటస్టెంటు వారి మధ్యను యున్నది. దానిని శాఖ అని పిలచు చున్నాము. నీకొలాయితుల బోధ ఒక సంస్థగా యున్నది. సంఘము యొక్క నాయకత్వమును మానవ పరము చేసిరి. ఆ విధంగా ఆత్మను వారు త్రోసివేసిరి. బిలాము బోధ ఒక శాఖగా మారినది. బైబిలునకు బదులుగా వారు సంఘ పుస్తకమును వాడుటకు ప్రారంభించిరి. ఈ ఘడియ వరకు కూడా చాలామంది దేవుని ప్రజలు శాఖ యొక్క ఉరిలో చిక్కుకొని యున్నారు. దేవుడు వారిని పిలచు చున్నాడు. "మీరు దాని పాపములలో పాలివారు కాకుండునట్లును, దాని తెగుళ్ళలో ఏదియు మీకు ప్రాప్తించకుండునట్లును దానిని విడిచి బయటకు రండి." వారు అజ్ఞానులుగా యున్నారని మీరు చూడగలరు. ఈ క్షణములో గాని రాకడ వచ్చినట్లయితే దేవుని తీర్పు నందు మనవి చేసికొనుటకు, తప్పుడు స్థితులలో ఉన్న బుద్ధి హీనతకు స్థానము లేదు.

మత గురువులు ఒకరి మీద ఒకరు హోదాను పొంది యున్నారు, చివరికి వారి పైన ఒక అధ్యక్షుడు వచ్చును. అదే క్రీస్తు విరోధి యొక్క ఆత్మ ప్రత్యక్షత. అది

ఎంతో అద్భుతముగాను, ఎంతో అవసరముగాను కనిపించినను దాని లక్షము చేయరు. అది మానవ హేతు బుద్ధి తప్ప మరేమియూ కాదు. వాక్యము యొక్క చోటును అది ఆక్రమించినది. సంస్థాగత శాఖలలో యుండు ఏ వ్యక్తి అయినా గాని అంత్య క్రీస్తు వ్యవస్థ యొక్క మధ్యలో యున్నట్లే. దీనిని ఇంకా తేటగా చెప్పెదను. నేను జనులకు విరోధిని కాను. నేను వాటి క్రమములకు విరోధిని.

సంఘము మరియు రాజ్యము ఏకమవుటతో అంధకార యుగములకు రంగము సిద్ధమయినది. దాదాపుగా 1000 సంవత్సరముల పాటు సంఘము నిజమునకు అంధకారములోనికి వెళ్లి పోయినది. సాతాను యొక్క లోతుల లోనికి వెళ్లి పోయినది. ఏ మత జనులయినా గాని బిలాము బోధను, నీకొలాయితుల బోధను నమ్ము చున్నారంటే వారు రాజకీయ, ఆర్థిక, భౌతిక బలములను వెంటాడుచున్నారని అర్థము. వారు అపుడు ఒకే మార్గములో పయనించగలరు. వారు తిన్నగా యెజెబెలు బోధలోనికి వెళ్ళెదరు. దీనిని ఇపుడు మనము ఎందుకు చెప్పుచున్నాము? ఎందు కనగా నాలుగవ సంఘ కాలముల వివరణలో, యెజెబెలు సీదోనీయురాలనియు, ఎత్బయలు కుమార్తె అని గుర్తించాము. అతడు అష్తారోతుకు (అషేరాదేవి) యాజకుడు. అతడు హంతకుడు. రాజకీయ లాభము కొరకు ఈ స్త్రీ ఆహాబును పెండ్లి చేసికొనెను. (అతడు ఇశ్రాయేలుకు రాజు) ఆ తరువాత ఆమె ప్రజల యొక్క మతములో జోక్యము చేసికొనినది. లేవీయులను చంపించినది. దేవాలయములను నిర్మించినది. ప్రజలు అష్తారోతును (వీనస్) ఆరాధన చేయునట్లు చేసినది. బయలును (సూర్య దేవుడు) పూజించుట నేర్పించినది. ఆమె సిద్ధాంతములను రూపొందించినది. తన యాజకులు దానిని బోధించునట్లు చేసెను. వారు ప్రజల చేత దానిని అంగీకరింప చేసిరి. అంధకార యుగములలో నామకార్థ సంఘమును మీరు చూడగలరు. వారు పూర్తిగా దేవుని యొక్క వాక్యమును విడిచిపెట్టిరి. దేవత్వము యొక్క కొన్ని పేర్లు మరియు బిరుదులను, కొన్ని లేఖన నియమములు మాత్రమే ఉంచుకొనిరి. వారు బైబిలులోని కొన్నింటిని తీసికొని మార్చిరి. వాటి యొక్క అర్థములను మార్చిరి. వారి యొక్క బిషప్పుల కళాశాలలు చాలా పెద్ద వ్యాసములను ప్రచురించినవి. వారి

పోపులు తప్పులేని వారని చెప్పసాగిరి. వారు దేవుని యొక్క ప్రత్యక్షతను పొంది, జనులతో దేవుడు మాట్లాడినట్లు మాట్లాడుచున్నామని చెప్పిరి. యాజకులకు దీనికి నేర్పించిరి. వారు ప్రజలను భయపెట్టి దానిని నమ్మునట్లుగా చేసిరి. దానికి లోబడనిచో మరణము లేదా బహిష్కరణ జరిగెడిది. అది మరణ శిక్ష కన్న ఘోరమైనది. అది సంఘము యొక్క వేదవాక్కు అయిపోయినది. వారు భీకర అధికారమును పొందిరి. వారు హతసాక్షుల యొక్క రక్తమును త్రాగిరి. నిజమయిన క్రైస్తవులను నానా హింసలు పెట్టిరి. వాక్యమనునది అసలు మిగల లేదు. పరిశుద్ధాత్మ యొక్క కొద్ది ప్రత్యక్షతయే మిగిలినది. కాని నిజమగు ద్రాక్షావల్లి సతమతమయి నిలద్రొక్కుకొనినది. దేవుడు చిన్నమందను నమ్మకముగా కాపాడెను. రోమ్ తమ శరీరములను ఏమి చేసినా లెక్క చేయలేదు. కాని రోమ్ వారిలోని ఆత్మను ఏమియూ చేయలేక పోయినది. సత్యము యొక్క వెలుగు ప్రకాశించ సాగినది. అందుకు పరిశుద్ధాత్మ మరియు శక్తి తోడయినది.

ఇక్కడ మనము లోతుగా పరిశీలించవలసిన అంశము ఒకటున్నది. మీరు చూచిన యెడల నీకొలాయితుల బోధ యొక్క క్రియలు, బిలాము యొక్క బోధ. అబద్ధ ప్రవక్త్రినియగు యెజెబెలు యొక్క బోధ మూడు వేర్వేరు ఆత్మల నుండి వచ్చినవి కావు. అవి మూడు ఆత్మ సంబంధ సిద్ధాంతములు కావు. ఈ మూడును ఒకే ఆత్మ యొక్క ప్రత్యక్షతలు. లోతు నుండి లోతునకు వెళ్ళుచున్నవి. ఇదంతయూ ఏమిటనగా క్రీస్తు విరోధి యొక్క ఆత్మ. అదియే సంస్థ. మూడు ఆయా దశలలో యున్నది. ఒక్కసారి యాజకులు వేరయిపోయి తమ సంస్థను ఏర్పరచుకొనిరి. వారు జనులను అణగద్రొక్కి అందులోనికి లాగిరి. ఆ సంస్థలలో చేర్చి వారిని కూడా అంధులనుగా చేసిరి. ఈ సంస్థకు మూలాధారము ఆచారములు మరియు సిద్ధాంతములు. ప్రజలకు వారు దేవుని వాక్యమును బోధించుట మాని దానికి బదులుగా వీటిని బోధింపసాగిరి. ఆరాధనలో కర్మకాండకు, ఆర్భాటమునకు ఎక్కువ ప్రాధాన్యమును ఇచ్చిరి. ఈ మొత్తం క్రమము త్వరలోనే సైనిక శక్తిగాను, బలమగు అధికారము గాను రూపొందినది. చర్చల ద్వారా ఒప్పింపజేయుటలోను, వాక్ శక్తితోను ప్రజలను అదుపు లోనికి తెచ్చుటకు శాయశక్తులా ప్రయత్నించిరి. తమ స్వంత అబద్ధ

ప్రవచనముల ద్వారా వీరు తమ శక్తిని పొందుకొనిరి. దేవుని వాక్యము ద్వారా వీరు శక్తి పొందలేదు. ఇపుడది పూర్తిగా క్రీస్తు విరోధి అయిపోయినది. అయితే క్రీస్తు నామమును పెట్టుకొని అది వచ్చి యున్నది.

ఇక ఎవరూ సహాయము చేయలేరనిపించు సమయము వచ్చినది. సత్యము ఇక తప్పకండా చనిపోవుననుకొనిరి. కాని అదే సమయములో జనులు లేచి రోమను కాతలిక్కు చర్చి యొక్క దుష్టత్వమును ఎదిరించ సాగిరి. ఎందుకనగా ఏ విధముగా చూచినా గాని ఆ బోధ గాని, ఆ ప్రవర్తన గాని దేవుని యొద్ద నుండి వచ్చుటకు ఆస్కారము లేదని వారు గ్రహించసాగిరి. ఈ ఎదిరించిన వారిని లెక్కచేయకుండా చంపసాగిరి. వారు ఎక్కువ మందిని ఆకర్షించుటలో విఫలులయిరి. రోమ్ ద్వారా అణచి వేయబడిరి. కాని అపుడు దేవుడు తన సార్వభౌమ కృప చొప్పున ఒక వర్తమానికుని పంపెను. అతడే మార్టిన్ లూథరు. సంస్కరణను ఆరంభించెను. అతడు పని చేసిన వాతావరణమును చూడండి. రోమ్ తన త్రాడును ఎంతో ఎక్కువగా విసరినది. కాని ఆ త్రాడు వలననే దానికి ఉరిశిక్ష వచ్చునని ఎరుగదు. విశ్వాసము ద్వారా నీతీకరణము జరుగునని లూథర్ బోధించినపుడు, అనేక శతాబ్దముల తరువాత నిజ సంఘము విస్తారమగు రీతిలో ఎదుగ నారంభించెను. నామకార్థ సంఘము రాజ్యాధికారమును ఉపయోగించుకొనసాగినది. కాని ఇపుడు రాజ్యాధికారము దానికి అనుకూలముగా ఉండుట లేదు. లూథరు ఇక్కడే తప్పు చేసెను. నిజ విశ్వాసులును తప్పు చేసిరి. రాజ్యము వారికి రాయితీలు ఇచ్చుటకు అనుమతించిరి. కావున ఈ కాలము వాక్యములో ఎంతో దూరము వెళ్ళలేక పోయినది. అయితే దేవునికి వందనములు. అది వెళ్ళగలిగినంత దూరము వెళ్ళినది. కాని అది రాజకీయ బలము మీద చాలా ఎక్కువగా ఆధారపడుట వలన ఈ కాలము చివరకు సంస్థగా మారినది. కారు ద్రాక్షావల్లి నుండి వేరయిన ఈ లూథరు తరములోని గుంపు తిరిగి వేశ్య కుమార్తెగా నుండుటకు మళ్ళి యున్నది. ఎందుకనగా అది మరల నీకొలాయితుల, బిలాము బోధల లోనికి వెళ్ళిపోయి యున్నది. ఈ శతాబ్దములో ఎన్నో చీలికలు వారిలో వారికి వచ్చి యున్నవి. నిజ సంతానము వారు ఎంత దూరముగా వెళ్ళిరో మీరు చూడవలెనన్నచో చరిత్ర చదవండి. వారు

ఒకరినొకరు ఎట్లు హింసించుకొనిరో చూడండి. కొన్ని సందర్భములలో నయితే చంపుకొనుట కూడా జరిగినది. కాని వారి మధ్యలో ఇంకా కొన్ని నామములున్నవి. ప్రతి కాలములోను ఉండిన విధంగానే అపుడును యుండిరి.

ఈ ఒక్క సంగతిని బట్టి మనము ఈ కాలమును గూర్చి సంతోషించ వలెను. సంస్కరణ ప్రారంభమయినది. అది ఒక పునరుద్ధానము కాదు గాని సంస్కరణ. అది పునరుద్ధరణ కూడా కాదు. నైసియా యొద్ధ భూమిలో పడి చనిపోయిన గోధుమ గింజ. అంధకార యుగములలో కుళ్ళిపోయి ఇపుడు సత్యమను చిగురును వేసి యున్నది. భవిష్యత్తు దినములలో, లవొదికయ సంఘ కాల అంతమందు, యేసు వచ్చు ముందుగా, సంఘము తిరిగి గోధుమ గింజ పెండ్లి కుమార్తెగా మారునని ఇది చూపించు చున్నది. అపుడు గురుగులను కోసి అగ్నిగుండములో వేసి కాల్చుదురు.

అయిదవ కాలములో వాక్యము ముద్రణ విరివిగా ప్రచురము చేయ బడినది. దాని ద్వారా వచ్చిన ఫలితమును ఆరవ కాలము చాలా త్వరగా ముందుకు వెళ్లినది. ఈ కాలము పునరుద్ధరణలోని రెండవ దశగా యున్నది. ఇంతకు ముందు మనము చెప్పుకొనినట్లుగా ఇది కుచ్చు (Tassel) కాలము. విద్య విస్తరించినది. ఇది మేధావుల యొక్క కాలము. వారు దేవునిని ప్రేమించి ఆయనకు సేవ చేసిరి. మిషనెరీలు ఎక్కువయిరి. వాక్యము ప్రపంచమంతా వ్యాపించెను. ఇది సహోదర ప్రేమ కాలము. ఇది తెరువబడిన తలుపు గల కాలము. ఇది ఎక్కువ వ్యవధి యున్న చివరి కాలము. దీని తరువాత లవొదికయ కాలము వచ్చును. దాని వ్యవధి చాలా తక్కువ.

ఏ కాలములోను వర్ధిల్లనంతగా నిజమగు ద్రాక్షావల్లి ఈ కాలములో వర్ధిల్లెను. దేశములోను, విదేశములలోను కూడా సంఖ్య ఎక్కువయినది. ఈ కాలము పరిశుద్ధులను అగ్ర భాగమునకు తీసికొని వచ్చినది. నిజమగు ద్రాక్షావల్లి వ్యాపించినది. కారు ద్రాక్షావల్లి వెనుకబడినది. నిజమగు ద్రాక్షావల్లి వెళ్ళిన ప్రతి చోటను దేవుడు వెలుగును, సంతోషమును, జీవమును ఇచ్చుచుండెను. కారు ద్రాక్షావల్లి యొక్క రంగు బయట పడినది. దానిలో చీకటి, దౌర్భాగ్య స్థితి.

దరిద్రము, నిరక్షరాస్యత మరియు మరణము ఉండెను. తనకు అధికారముండిన దినములలో ఈ కారు ద్రాక్షావల్లి మంచి ద్రాక్షావల్లిని ఏలాగు చంపలేకపోయినదో, అదే విధంగా ఇపుడు నిజమగు ద్రాక్షావల్లి కారు ద్రాక్షావల్లిని యేసు క్రీస్తు యొద్దకు నడిపించలేకపోయినది. కాని కారు ద్రాక్షావల్లి తన గొయ్యిని తానే త్రవ్వుకొనినది. చివరి కాలములోని తన చివరి పాత్ర కొరకు ఎదురు చూచుచున్నది. అపుడది అందరినీ తిరిగి జయించును. కాని దేవుని నిజమగు ద్రాక్షావల్లిగాను, ఏర్పచబడిన చిన్న మందగాను యుండిన ఆ కొద్దిమందిని మాత్రము జయించలేదు.

ఈ కాలమును గూర్చి తలంచు చున్నప్పుడు చాలా విచారము కలుగును. ఎందుకనగా దేవుని యొక్క గొప్ప ఉద్యమములు ఎన్నో ఇందులో లేచి యున్నవి. (అనేకులుండిరి) అయినా వారు నీకొలాయితుల బోధను నిర్మూలించ లేకపోయిరి. అందువలన వారు సంస్థగా మారి చనిపోయిరి. తరువాత వారు శాఖల లోనికి వెళ్లి అక్కడ ఆత్మీయముగా చనిపోయిరి. ఎందుకనగా అవి ఆహారము లేని బీడు భూములని వారికి తెలియదు. ప్రతి గుంపు గూడా అదే తప్పును చేసినది. ఉజ్జీవ జ్వాల చల్లబడ సాగినది. సంస్థ వికసించినది. జనులు శాఖా సంబంధులయిరి. వారు కేవలము నామకార్థ క్రైస్తవులై తామే నిజమయిన వారమని రోమను కాతలిక్కు చర్చి చెప్పుకొని నట్లుగా చెప్పుకొనిరి. ఎవరికి వారే తమది సరియైనదని మిగిలిన వారిది తప్పు అనియు చెప్పుట మామూలే. కుమార్తెలు చివరి కాలములో తమ గృహమునకు వెళ్ళుటకు, రోమ్ యొద్దకు తిరిగి చేరుటకు, తల్లి పెట్ట క్రిందికి వెళ్ళుటకు సిద్ధపడి యున్నారు.

ఇపుడు మనము చివరి కాలము యొద్దకు వచ్చుచున్నాము. లవొదికయ కాలము. అది మన కాలము. యూదులు పాలస్తీనాను చేరు కాలము చివరి కాలమేనని మనకు తెలియును. వారెట్లు అక్కడికి వచ్చిరన్నది కాదు గాని, వారక్కడికి చేరిరి. ఇది కోత కాలము. కోత కోయుటకు ముందు ఆ రెండు ద్రాక్షావల్లుల ఫలములు పరిపక్వము చెందవలసి యున్నవి.

లూథర్ కాలము వసంత కాలము. వెస్లీ కాలము ఎండాకాలపు ఎదుగుదల కాలము. లవొదికయ కాలము కోత కాలము. ఈ కాలములో గురుగులన్నియు కట్టలు కట్టబడి కాల్చి వేయబడును. గోధుమలను ప్రభువు కొరకు సమకూర్చుదురు.

ఇది కోత కాలము. కోత కాలమును మీరు గమనించండి. గింజ పండుట చాలా త్వరితముగానే జరుగుచుండును గాని ఎదుగుదల మాత్రము చాలా నెమ్మదిగా జరుగుచుండును. చివరికి ఎదుగుదల ఆగిపోవును. దానిని ఇపుడు మనము చక్కగా చూచుట లేదా? కారు ద్రాక్షావల్లికి చెందిన ఒక జన సమూహములు కమ్యూనిస్టుల చేతుల లోనికి పోవు చున్నారు. ఇంకా వేరు వేరు నమ్మకముల వైపు వెళ్ళిపోవు చున్నారు. మనము అనుకొనినంత విస్తారముగా దాని సంఖ్య పెరుగుట లేదు. ఇంతకు ముందు ప్రజల మీద దానికుండిన పట్టు ఇపుడు లేదు. చాలా సందర్భములలో సంఘమునకు వెళ్ళుట ఒక ప్రదర్శనగా మారినది. నిజ ద్రాక్షావల్లి ఎట్లున్నది? దాని సంగతి ఏమిటి? అది ఎదుగుచున్నదా? ఉజ్జీవముల కాలము లోను, వేదిక ఆహ్వానమిచ్చినపుడును వచ్చుచుండిన ఆ గొప్ప సంఖ్యలోని జనులు ఇపుడెచ్చటున్నారు? వారిలో చాలామంది కేవలము ఉద్రేకముతో వచ్చిన వారు కారా? నిజంగా ఆత్మ సంబంధమగు విషయములను వారు ఆశించి రాలేదు గాని ఏదో శరీర సంబంధమగు అవసరతలను తీర్చుకొనుటకు వచ్చిరి. నోవహు ఓడ లోనికి ప్రవేశించిన వెంటనే తలుపు మూయబడెను. కాని దేవుడు తన తీర్పును వారి మీదికి పంపకుండా ఇంకా ఏడు రోజులు వేచి యుండెను. ఈ దినములు ఆలాగు లేవా? ఆ నిశ్శబ్ద దినములలో ఏ ఒక్కరును దేవుని వైపు తిరుగలేదు.

అయినా గాని ఇది కోత కాలము. ఈ కాలములో గురుగులను, గోధుమలను పరిపక్వము చెందించుటకు రంగము మీదికి వారు తప్పక రావలసి యున్నారు. చెడు బోధకుల మూలముగా గురుగులు చాలా త్వరగా పక్వము చెందు చున్నవి. జనులను వారు వాక్యము నుండి మళ్ళించు చున్నారు. కాని గోధుమలు కూడా పరిపక్వము చెందవలెను. ఆమె కొరకు దేవుడు ప్రవక్త వర్తమానికుని పంపు చున్నాడు. ప్రత్యక్షత గల పరిచర్య అతనికున్నది. అతనిని ఏర్పరచబడిన వారు స్వీకరించుదురు. మొదటి సంఘము పౌలు యొక్క మాటను వినినట్లుగానే వారు అతని మాటలను విందురు. ఆమె వాక్యముతో పరిపక్వము చెందును. చివరకు వాక్య పెండ్లి కుమార్తెగా మారును. ఆమె యందు బలమగు కార్యములు కనబడును. పరిశుద్ధ వాక్యము మరియు విశ్వాసమున్న చోట అవి తప్పక కనబడును.

అబద్ధ సంఘపు గుంపులు ప్రపంచ సంఘముల సంఖ్యలో ఏకముగా కూడి వచ్చును. ఈ ప్రపంచ సంఘముల సమాఖ్యయే మృగమునకు నిర్మించబడిన ప్రతిమయై యున్నది. ప్రకటన 13:11–18. "మరియు భూమిలో నుండి మరియొక క్రూరమృగము పైకి వచ్చుట చూచితిని. గొర్రెపిల్ల కొమ్ము వంటి రెండు కొమ్ములు దానికి ఉండెను. అది ఘట స్వరము వలె మాట్లాడు చుండెను. అది ఆ మొదటి క్రూర మృగమునకున్న అధికారపు చేష్టలన్నియూ దాని యెదుట చేయు చున్నది. మరియు చావు దెబ్బ తగిలి బాగుపడియున్న ఆ మొదటి మృగమునకు భూమియు దానిలో నివసించు వారును నమస్కారము చేయునట్లు అది బల వంతము చేయుచున్నది. అది ఆకాశము నుండి భూమికి మనుష్యుని యెదుట అగ్ని దిగి వచ్చునట్లుగా గొప్ప సూచనలు చేయుచున్నది. కత్తి దెబ్బతినియు, బ్రదికిన ఈ క్రూర మృగమునకు ప్రతిమను చేయవలెనని అది భూనివాసులతో చెప్పుచు ఆ మృగము ఎదుట చేయుటకు తనకియ్యబడిన సూచనల వలన భూనివాసులను మోసపుచ్చుచున్నది. మరియు ఆ మృగము యొక్క ప్రతిమ మాట్లాడునట్లును, ఆ మృగము యొక్క ప్రతిమకు నమస్కారము చేయని వారిని హతము చేయునట్లును ఆ మృగము యొక్క ప్రతిమకు ప్రాణమిచ్చుటకై దానికి అధికారమియ్యబడెను. కాగా కొద్ది వారు గాని, గొప్పవారు గాని, ధనికులు గాని, దరిద్రులు గాని, స్వతంత్రులు గాని, దాసులు గాని, అందరును తమ కుడి చేతి మీదనైనను, తమ నొసటి యందైనను ముద్ర వేయించుకొనునట్లును, ఆ ముద్ర అనగా ఆ మృగము పేరైనను, దాని పేరిటి సంఖ్యయైనను గలవాడు తప్ప క్రయ విక్రయములు చేయుటకు మరి ఎవరికిని అధికారము లేకుండునట్లు అది వారిని బలవంతము చేయుచున్నది. బుద్ధి గలవాడు మృగము యొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము. అది యొక మనుష్యుని యొక్క సంఖ్యయే. ఆ సంఖ్య ఆరువందల అరువది యారు. ఇందులో జ్ఞానము గలదు." ఇపుడు గుర్తుంచుకొనండి. అది ఖడ్గము ద్వారా కూల్చబడిన రాజ్యారికపు అన్య రోమ్. కాని అది ఆ చావు దెబ్బ నుండి కోలు కొన్నది." అది రోమ్ యొక్క నామకార్థ సంఘములో చేరినది. అన్యత్వమును మరియు క్రైస్తవ్యమును అది కలగలుపు చేసి, ఆ విధముగా పరిశుద్ధ రోమను సామ్రాజ్యముగా మారి, యేసు వచ్చి

దానిని నాశనము చేయుటకు అది సహించవలసి యున్నది. కాని రోమ్ ఒక్కటిగా వెళ్ళదు. దాని కుమార్తెలు దానితోనే యుందురు. ప్రపంచ సంఘముల సమాఖ్య ద్వారా నిరాపేక్ష అధికారమును అది హస్తగతము చేసికొనును. కొందరికిది చాలా దూర సత్యముగా కనిపించ వచ్చును కాని అది వాస్తవము. చాలా తేటగా యున్నది. అందరూ చూడగలరు. ఎందుకనగా ఇపుడు సంఘములు రాజకీయములను అదుపు చేయుచున్నవి. సరయిన సమయములో ఆ అదుపు ఎంత బలమైనదో అర్థమగును. ఈ సమాఖ్య ఉద్యమము చివరకు రోమ్‌తో అంతమగును. రోమ్ శిరస్సుగా యుండును. కాని ప్రజలు అది ఆ విధముగా యుండునని తలంచుట లేదు. ఇది నిజము. ఎందుకనగా ప్రకటన 17:3–6 లో అది చెప్పబడినది. వేశ్యయగు, మర్మమై యున్న బబులోను మృగము మీద కూర్చొని యున్నది. చివరిది అనగా నాలుగవ సామ్రాజ్యమును అది అదుపులో ఉంచు చున్నది. ఈ రోమను సంఘము దానిని చేయు చున్నది. దాని క్రింద ప్రపంచ సంఘ క్రమము యున్నది. దానిని రోమ్ అదుపు చేయుచున్నది. ఈ ప్రతిమ (సంఘ క్రమము) రోమ్‌కు విధేయురాలుగా యుండును. ఎందుకనగా రోమ్ యొక్క అదుపులో ప్రపంచ బంగారమున్నది. ఆ విధముగా ప్రజలందరును ప్రపంచ సంఘ క్రమమునకు చెంది యుందురు. లేదా వారి యొక్క దయా దాక్షిణ్యముల క్రింద యుందురు. ఎందుకనగా చేతి మీద గాని, నొసటి మీద గాని మృగము యొక్క ముద్ర లేని యెడల క్రయ విక్రయములు చేయుటకు ఎవరికిని హక్కు ఉండదు. నొసటి మీద ఈ ముద్ర అనగా ప్రపంచ సంఘ క్రమమగు త్రిత్వవాదము మొదలగు వాటిని, దాని బోధలను స్వీకరించినట్లే అర్థము. చేతి మీద ముద్ర అనగా ప్రపంచ సంఘము యొక్క ఇష్టమును చేయుటయని అర్థము. ఈ మహాశక్తి ద్వారా సంఘ క్రమములు నిజమగు పెండ్లి కుమార్తెను హింసించును. ఈ ప్రతిమ పెండ్లి కుమార్తెను బోధించనీయకుండాను, ఉపదేశించనీయకుండాను చేయుటకు ప్రయత్నించును. అవసరమయిన ప్రజలకు సత్యమును మరియు ఆదరణను ఆమె సేవకులు అందనీయకుండా అడ్డు తగులును. కాని అంత్యక్రీస్తు (వ్యక్తి) ఈ మొత్తం ప్రపంచ సంఘముల క్రమమును తన వశము చేసికొను ముందుగా నిజ సంఘము కొనిపోబడును. ఈ లోకము నుండి

ఆమె కొనిపోబడి ప్రభువుతో నిత్యమూ యుండును. గొర్రెపిల్ల యొక్క గొప్ప పెండ్లి విందునకు తన పెండ్లి కుమార్తెను దేవుడు తీసికొని పోవును.

పెంతెకోస్తు ప్రారంభమయినది మొదలుకొని యుగాంతము వరకు ఉండు రెండు సంఘములను మరియు రెండు ఆత్మలను కనిపెట్టుట కొరకు ఈ ముగింపు అధ్యాయము ఇయ్యబడి యున్నది. లవొదికయ సంఘ కాలములో దానిని చూపించుటకు ఈ తుది సమయమును మనము తీసికొందుము.

ఇరవయ్యవ శతాబ్దపు మలుపులో ఈ కాలము ప్రారంభమయినది. పెంతెకోస్తు యొద్ద ఉండిన పెండ్లి కుమార్తెగా తిరిగి నిజ సంఘము ఈ కాలములో రావలసి యున్నది. అఖండమగు శక్తి తిరిగి రావలసి యున్న అవసరతను మనము ఎరుగుదుము. విశ్వాసులు తమ ఆత్మలలో దీనిని పసిగట్టిరి. మొదటి శతాబ్దములో వున్నట్లే క్రొత్త కుమ్మరింపు కావలెనని వారు దేవునికి మొరపెట్టు చుండిరి. జవాబుగా వలె అనేకులు భాషలలో మాట్లాడసాగిరి. ఆత్మ యొక్క వరములను బయలుపరచ సాగిరి. ఎప్పటి నుండియో ఎదురు చూచుచున్న పునరుద్ధరణ ఇదియేనని అపుడు అనేకులు నమ్మిరి. అది కడవరి వర్షమునకు కాదు. ఎందుకనగా తొలకరి వర్షము తరువాతనే కడవరి వర్షము వచ్చును. అదే వసంత కాలము. లేదా ఉపదేశపు వర్షము. అపుడు కడవరి వర్షము అనగా కోత కాలపు వర్షము. ఉపదేశపు వర్షము రాకుండా అది నిజమయినది ఎట్లు కాగలదు? జనులకు ఉపదేశించుటకు ప్రవక్త వర్తమానికుడు పంపించబడును. పెంతెకోస్తు తండ్రుల వైపు పిల్లల హృదయములను త్రిప్పుట ఇంకా జరుగలేదు. ఆ విధముగా వారు పునరుద్ధరణ అనుకొనినదియు రాకడ కొరకు తుది మేల్కొలుపు అనుకొనినది ఇంకా రాలేదు. దాని యందు మిశ్రమ మున్నది. దుర్నీతి పరులు ఆత్మ సంబంధమగు దీవెనలలో పాలు పొంది యున్నారు. పరిశుద్ధాత్మలో ప్రత్యక్షతలు చూపించు దానిని మీకు చూపించుచునే యున్నాము. దానియందు అపవాది యొక్క శక్తి యున్నది. మనుష్యులు అపవాది యొక్క శక్తి క్రింద యుండిరి. కాని దానిని ఎవరూ గ్రహించలేదు. అది నిజము కాదని రుజువు చేయుదును. ఎందుకనగా వారు సంస్థగా మారిరి. (కనీసము రెండవ తరము కూడా రాక ముందే) వాక్యములో లేని స్వంత సిద్ధాంతములను వారు వ్రాసికొనిరి. వారికి ముందున్న ప్రతి గుంపు చేసినట్లుగానే తమ చుట్టూ కంచెను కట్టుకొనిరి.

గుర్తుంచుకొనండి. యేసు భూమి మీద ఉండినపుడు యూదా ఆ విధం గానే యుండెను. ప్రతి ఒక్కరు వేర్వేరు ఆత్మ నుండి వచ్చిరి. మరణించిన తరువాత ఎవరి స్థలమునకు వారు వెళ్ళిరి. ఆ తరువాత క్రీస్తు ఆత్మ నిజ సంఘము మీదికి తిరిగి వచ్చినది. యూదా యొక్క ఆత్మ అబద్ధ సంఘము మీదికి వచ్చి యున్నది. దానిని మీరు ప్రకటన 6:1-8 లో చూడగలరు. "ఆ గొర్రెపిల్ల ఆ ఏడు ముద్రలలో మొదటి దానిని విప్పినపుడు నేను చూడగా ఆ నాలుగు జీవులలో ఒకటి రమ్ము అని ఉరుము వంటి స్వరముతో చెప్పుట వింటిని." మరియు నేను చూడగా ఇదిగో ఒక తెల్లని గుర్రము కనబడెను. దాని మీద ఒకడు విల్లు పట్టుకొని కూర్చుండి యుండెను. అతనికి ఒక కిరీటమియ్యబడెను. అతడు జయించుచు జయించుటకు బయలు వెళ్ళెను. ఆయన రెండవ ముద్రను విప్పినపుడు రమ్ము అని రెండవ జీవి చెప్పుట వింటిని. అపుడు ఎర్రనిదైన వేరొక గుర్రము బయలు వెళ్ళెను. మనుష్యులు ఒకని ఒకడు చంపుకొనునట్లు భూలోకములో సమాధానము లేకుండా చేయుటకు ఈ గుర్రము మీద కూర్చొన్న వానికి అధికారమియ్యబడెను. మరియు అతనికి ఒక పెద్ద ఖడ్గమియ్యబడెను. ఆయన మూడవ ముద్రను విప్పినపుడు రమ్ము అని మూడవ జీవి చెప్పుట వింటిని. నేను చూడగా, ఇదిగో ఒక నల్లని గుర్రము కనబడెను. దాని మీద ఒకడు త్రాసు చేత పట్టుకొని కూర్చుండి యుండెను. మరియు దేనారమునకు ఒక సేరు గోధుమలనియు, దేనారమునకు మూడు సేర్ల యవలనియు, నూనెను ద్రాక్షారసమును పాడు చేయవద్దనియు ఆ నాలుగు జీవుల మధ్య ఒక స్వరము పలికినట్లు నాకు వినబడెను. ఆయన నాలుగవ ముద్రను విప్పినపుడు రమ్ము అని నాలుగవ జీవి చెప్పుట వింటిని. అప్పుడు నేను చూడగా ఇదిగో పాండుర వర్ణము గల ఒక గుర్రము కనబడెను. దాని మీద కూర్చొన్న వాని పేరు మృత్యువు. పాతాళ లోకము వానిని వెంబడించెను. ఖడ్గము వలనను కరవు వలనను మరణము వలనను భూమిలో నుండు క్రూర మృగముల వలనను భూనివాసులను చంపుటకు భూమి యొక్క నాలుగవ భాగము పైన అధికారము వానికియ్యబడెను. "ఆ యూదా యెక్క ఆత్మ తెల్లని గుర్రమును ఎక్కిన వానిగా ఎట్లు వచ్చెనో చూడండి. అది తెల్లని గుర్రము. అసలయిన దానికి చాలా దగ్గరగా యున్నది. యూదా యేసుకు దగ్గరగా యుండినట్లే ఉన్నది." ఏలాగు అతనికి ఒక

కిరీట మియ్యబడెను? (తెల్లని గుర్రము మీద ఎక్కిన వానికి) నీకొలాయితు క్రమము యొక్క నాయకునిలో ఆ ఆత్మ ఇపుడున్నది. ముక్కోణపు కిరీటము ధరించిన పోపు తన ఆలయములో దేవునిగా కూర్చొని క్రీస్తు యొక్క స్థానములో యున్నానని చెప్పుకొనుచున్నాడు. క్రీస్తుకు బదులుగాను, లేదా క్రీస్తు స్థానములోను, లేదా దేవుని పక్షముగాను యున్నానని చెప్పుచున్నాడు. తానే పరిశుద్ధాత్మనని పోపు చెప్పుకొనుచున్నాడు. పరిశుద్ధాత్మను నిరాకరించి నేనే పరిశుద్ధాత్మనని చెప్పుకొను చున్నాడు. ఆయన తరపున పనిచేయుచున్నాడు. అతనిలో యుదా ఆత్మ, ఉండి అలాగున పనిచేయుచున్నది. అతడెట్లు జయించెనో చూడుడి. – జయించుచూ జయించుటకు బయలు వెళ్ళెను. క్రీస్తు ఆలాగు చేయలేదు. ఆయన యొద్దకు వచ్చిన వారు తండ్రి చేత ముందుగానే నిర్ణయింపబడిరి. ఆ ఆత్మ ఎంతో ముందుకు పయనించినది. ఒక దినమున నిజముగానే అది మానవునిగా అవతరించును. ప్రపంచ సంఘ సమాఖ్యకు శిరస్సుగా నుండును. దానినే మనము చెప్పుకొనుచున్నాము. తన యొద్ద నున్న బంగారము ద్వారా మొత్తం ప్రపంచమును వాడు అదుపు చేయును. (యూదా యొద్ద డబ్బు సంచి యుండెనని మరువ వద్దు) ఆ క్రీస్తు విరోధి క్రమము సమస్తమును తన స్వాధీనము చేసికొనును. అందరినీ వశపరచుకొనుటకు ప్రయత్నించును. కాని యేసు తిరిగి వచ్చును. తన యొక్క రాకడ ప్రకాశమానముతో వారినందరినీ నాశనము చేయును. వారి యొక్క అంతము అగ్నిగుండమే.

కాని నిజమగు విత్తనము మాట ఏమిటి? మనము చెప్పుకొనిన రీతిగానే జరుగును. ఈ కాలమునకు చెందిన వర్తమానికుని యొద్ద నుండి సత్య వాక్యమును వినుట ద్వారా దేవుని ప్రజలు సిద్ధపరచబడుదురు. పెంతెకోస్తు యొక్క సంపూర్ణత ఆమెలో యుండును. ఆది యందు వారు ఎక్కడ యుండిరో అక్కడికి ఆది జనులను తిరిగి తీసికొని వచ్చును. అది "యెహోవా ఈలాగు సెలవిచ్చు చున్నాడు" అయి యున్నది.

అది "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు." ఎందుకనగా యోవేలు 2:23-26 లో చెప్పినది అదే. "సీయోను జనులారా, ఉత్సహించి మీ దేవుడైన

యెహోవా యందు సంతోషించుడి. తన నీతిని బట్టి ఆయన తొలకరి వర్షమును మీకనుగ్రహించును. వాన కురిపించి పూర్వము వలె తొలకరి వర్షమును కడవరి వర్షమును మీకనుగ్రహించును. కొట్లు ధాన్యముతో నిండును. క్రొత్త ద్రాక్షారసమును క్రొత్త తైలమును గానుగలకు పైగా పొర్లిపారును. మీరు కడుపార తిని తృప్తి పొంది మీ కొరకు వింత కార్యములను జరిగించిన మీ దేవుడైన యెహోవా నామమును స్తుతించునట్లు నేను పంపిన మిడుతలును గొంగళి పురుగులును పసరు పురుగులును చీడపురుగులును అను నా మహా సైన్యము తినివేసిన సంవత్సరముల పంటను మీకు మరల ఇత్తును. నా జనులు ఇక నెన్నటికిని సిగ్గునొందరు. దేవుడు "మరల ఇచ్చెదనని" సెలవిచ్చుచున్నాడు. లూథరను కాలము సంఘమును చక్కదిద్ద లేదు. వెస్లియను సంఘ కాలము పునరుద్ధరించలేదు. కాని దేవుడు పునరుద్ధరించనై యున్నాడు. ఎందుకనగా ఆయన తన వాక్యమును కాదనలేదు. ఇది సంఘము యొక్క పునరుద్ధానము కాదు. ఇది "పునరుద్ధరణ." ఆదిలో యుండిన పెంతెకోస్తు యొద్దకు దేవుడు సంఘమును తీసికొని పోవుచున్నాడు. 25 వ వచనమును ఇపుడు గమనించండి. ఎందుకు మనకు పునరుద్ధరణ అవసరమో అది చెప్పుచున్నది. మిడుతలు, గొంగళి పురుగులు, పసరపు పురుగులు, చీడ పురుగులు అంతయూ తినివేసినవి. కాని వేరు మరియు చిన్న కాండము మిగిలి యున్నది. ఈ పురుగులు అన్నీ ఒక్కటేనని చెప్పబడినది. ఆ యా దశలలో ఒక్కటిగా యున్నవి. అది నిజము. అదియే క్రీస్తు విరోధి ఆత్మ. సంస్థలో అది ప్రత్యక్షమయినది. అది నిజము. అవి క్రీస్తు విరోధి ఆత్మయై యున్నవి. సంస్థలో అది వెల్లడి అయినది. శాఖలో బయలుపడినది. ఆ యా కాలములలో అబద్ధ బోధ వచ్చి యున్నది. ఆ చిన్న వేరు మరియు కాండము పునరుద్ధరించబడును. దేవుడు ఒక క్రొత్త సంఘమును స్థాపించడు. కాని ఆయన తన ఆది సంఘము యొక్క స్థితికి. మూల విత్తనము యొక్క స్థితికి దీనిని తీసికొని వచ్చును. 23 వ వచనములో చెప్పినట్లుగా ఆయన చేయును. ఉపదేశము ద్వారా "తొలకరి వర్షము" ద్వారా దానిని చేయును. ఆ తరువాత కడవరి వర్షము లేదా ఎత్తబడు విశ్వాసము వచ్చును.

ఆ విధముగా ఈ క్షణమందు మనము మత్తయి 24:24 యొక్క సంపూర్ణ నెరవేర్పులో యున్నాము. "సాధ్యమయితే ఏర్పరచబడిన వారిని సహితము మోసము

చేయును.'' ఏర్పరచబడిన వారిని కూడా సాధ్యమయితే మోసము చేయు వారెవరు? అది ఈ క్రీస్తు విరోధి ఆత్మ. ఈ చివరి దినపు అబద్ధ అభిషిక్తుల ద్వారా అది అందుకు ప్రయత్నములు చేయుచున్నది. ఈ అబద్ధికులు ఇప్పటికే వచ్చి యున్నారు. ''యేసు నామములో'' వారు వచ్చి తాము చివరి దినమునకు అభిషేకించబడి నట్లుగా చెప్పుకొనుచున్నారు. వారు అబద్ధ మెస్సీయలు. (అభిషిక్తులు) వారు ప్రవక్తలమని చెప్పుకొనుచున్నారు. కాని వారు వాక్యముతో ఏకమయిరా? ఎన్నడూ ఏకమవరు? వాక్యమునకు వారు కొంత కలిపిరి లేదా కొంత తీసివేసిరి. వరముల ద్వారా దేవుని యొక్క ఆత్మ వారి మీద పని చేయుచున్నదను సత్యమును ఎవరూ కాదనలేరు. కాని బిలాము వలె వారికి ఎన్నో కార్యక్రమములున్నవి. డబ్బు కొరకు విజ్ఞాపనలు చేయుచున్నారు. వరములను సాధకము చేయు చున్నారు. కాని వాక్యమును నిరాకరించుచున్నారు. దానిని అతిక్రమించు చున్నారు. ఏదైనా వివాదము తలయెత్తిన యెడల తన సంపాదన తగ్గిపోవునేమోనని భయపడు చున్నారు. అయినా గాని వారు దేవుని శక్తి ద్వారా రక్షణను, విమోచనను ప్రకటించు చున్నారు. యూదా వలె వారికి క్రీస్తు యొక్క ఒక పరిచర్య యున్నది. కాని వారు తప్పుడు సంతానము అయినందున వారిలో తప్పుడు ఆత్మ యుండి నడిపించు చున్నది. మతమా? ఓ! వారు ఏర్పరచబడిన వారిని మించిపోయి ఆసక్తిని ప్రయత్నములను ప్రదర్శించు చున్నారు. కాని అది లవొదికయ సంఘము. క్రీస్తుకు చెందినది కాదు. ఎందుకనగా అది పెద్ద కార్యములను చేయవలెననియు, ఎక్కువ మందిని పోగు చేయవలెననియు, ఆశ్చర్యమును కలిగించు సూచక క్రియలను జరిగించ వలెననియు చూచుచున్నది. వారు క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి ప్రకటించెదరు. కాని ప్రవక్తయగు వర్తమానికుని యొక్క రాకను వ్యతిరేకించు చున్నారు. అతడు శక్తిని, సూచకక్రియలను, నిజ ప్రత్యక్షతను కనుపరచుచున్నాగాని వారు చూడలేకపోవు చున్నారు. ఈ చివరి దినమున అబద్ధపు ఆత్మ నిజమగు దానికి చాలా దగ్గరగా యున్నది. వాక్యము నుండి అది తొలగుట వలన మాత్రమే దానిని మనము గమనించ గలము. ఎపుడును అది వాక్యమునకు విరోధియే. దాని యొక్క వాదనను ఇంతకు ముందే మనము చూచి యున్నాము. ''మాకు ఫలితములు వచ్చు చున్నవి. కాబట్టి మేము దేవుని సంబంధులము'' అని వాదించు చున్నారు.

ఇపుడు మనము ముగించు ముందుగా ఈ ఆలోచనను నేను తీసికొని రావలెనని కోరుచున్నాను. గోధుమ గింజ పాతి పెట్టబడి ఆ తరువాత చిగురించుట, తరువాత కుచ్చు వచ్చుట, నిజమగు వెన్ను వేయుటను గురించి ఇంత వరకు మనము చెప్పుకొని యున్నాము. లూథరనులు ప్రాథమికముగా నీతీకరణము గూర్చి మాత్రము బోధించినందున వారి పరిశుద్ధాత్మను పొందలేదని చెప్పినచో కొందరు ఆశ్చర్యము చెందుదురు. మెతడిస్టుల గూర్చి ఆలాగు చెప్పిన యెడల వారు ఆశ్చర్యము చెందుదురు. లేదండీ! దానిని మనము చెప్పుట లేదు. మన వ్యక్తుల గూర్చి గాని, ప్రజలను గూర్చి గాని మాట్లాడుట లేదు గాని కాలములను గూర్చి మాట్లాడు చున్నాము. దేవుని యొక్క ఆత్మ లూథరులో వుండినది. కాని అతని కాలము మొదటి ఆత్మ క్రుమ్మరింపు వలె పూర్ణ పునరుద్ధరణ కలిగిన కాలము కాదు. వెస్లీ, బూత్, నాక్స్, వైట్ ఫీల్డు, బ్రెయినార్డు, జోనాతాను ఎడ్వార్ట్సు. ముల్లర్, మొదలగు వారి విషయములో కూడా అంతే. నిశ్చయంగా వారు పరిశుద్ధాత్మ పూర్ణులే. కాని వారు వారు జీవించిన ఏ కాలములో కూడా పునరుద్ధరణ జరుగ లేదు. ఈ చివరి కాలము తప్ప ఏ కాలము కూడా పునరుద్ధరణ కాలము కాదు. ఈ కాలములో విశ్వాసమును కోల్పోవుట వలన పూర్తి అంధకారము ఏర్పడినది. ఇది భ్రష్టత్వ కాలము. మరియు పునరుద్ధరణ కాలము. సంపూర్ణమైన చక్రము యొక్క కాలము ఇది. దీనితో అంతా సమాప్తమయినది.

కావున ఏడు సంఘ కాలములను ఈలాగు మనము ముగించుదము. ప్రతి కాలమునకు ఆత్మ చెప్పిన దానిని మాత్రమే మనము చెప్పుదము. "సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాటను చెవిగలవాడు వినును గాక."

దేవుని యొక్క ఆత్మ మనతో మాట్లాడుచున్నదని నేను యథార్థముగా నమ్ముచున్నాను. కాలముల యొక్క సత్యములను మనకు బోధించుట మాత్రమే గాక, ఆయన వైపు తిరుగునట్లుగా ఆయన మన హృదయములతో నమ్మకముగా మాట్లాడుచున్నాడు. ఆ కారణము చేతనే ఈ బోధ మరియు ఉపదేశము జరుగు చున్నది. ఎందుకనగా వాక్యము యొక్క బోధ మరియు ఉపదేశములోనే గొర్రెలు **దేవుని యొక్క స్వరమును విని ఆయనను వెంబడించును.**

నన్ను జనులు వెంబడించవలెననియు, నా సంఘములో చేరవలెననియు, లేదా ఏదో సంస్థను మరియు సహవాసమును ప్రారంభించ వలెననియు ఉద్దేశముతో నేను ఈ వర్తమానమును బోధించడము లేదు. ఎన్నడూ నేను ఆలాగు చేయలేదు. ఇపుడు కూడా అది చేయను. ఆ సంగతులలో నాకు ఆసక్తి లేదు. దేవుని యొక్క సంగతులలోను, ప్రజలలోను నాకు ఆసక్తి యున్నది. ఒక్క పనిని నేను నెరవేర్చినా గాని నేను సంతృప్తి చెందెదను. ఆ ఒక్క సంగతి ఏమనగా దేవునికి మానవులకు మధ్య నిజ సంబంధము ఏర్పడునట్లు చూచుటయే. అపుడు మానవులు క్రీస్తు నందు నూతన సృష్టియగుదురు. ఆయన ఆత్మతో నింపబడుదురు. ఆయన వాక్య ప్రకారము జీవించెదరు. ఈ సమయములో ఆయన స్వరమును వినమని అందరినీ ఆహ్వానించి, బ్రతిమాలి హెచ్చరించెదను. మీ జీవితములను పూర్తిగా ఆయనకు సమర్పించుడి. నేను కూడా నా జీవితమును పూర్తిగా ఆయనకు సమర్పించి యున్నానని నా హృదయములో పూర్తిగా నమ్ముచున్నాను. దేవుడు మిమ్ము దీవించును. ఆయన రాక మీ హృదయమును సంతోషపరచును గాక. ఆమేన్.

❋ ❋ ❋

**S. దానియేల్ సంపత్ కుమార్**
**డోర్ నెం: 147, తిరునిలై కాలని,**
**విచూర్ పోస్ట్, చెన్నై-600103**




*for books contact :*

**S.DANIEL SAMPATH KUMAR**

*No. 147, Thirunilai colony ,*
*vichoor post , chennai - 600 103*
*E-Mail : sdanielsampathkumar@gmail.com*
*Website : danielendtimebooksministry.org*
*Phone No :* 99419 74213 , 96001 71260